క్లుప్తంగా

చిరు వ్యాపారికి తోపుడు బండి వితరణ



నెహ్రూనగర్: కావటి సుధీర్‌నాయుడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటుకూరు రోడ్డులో చిరు వ్యాపారి షేక్ బాషాకు ఫౌండేషన్ తోపుడు బండి అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శనివారం అందజేశారు. ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో కూడా మరిన్ని చేస్తామని తెలిపారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: లాడ్జిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు ప్రాంతానికి చెందిన అలి రఘువంశయాదవ్ (24) సీఏ పూర్తి చేశాడు. రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో ఇంటర్వ్యూకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పాడు. అయితే, అక్కడకు వెళ్లకుండా గుంటూరువారితోటలోని వెన్నల లాడ్జిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి మృతికి ఎటువంటి కారణాలు తెలియ లేదు. కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యానుకు ఉరి వేసుకుని యువకుడు...

గుంటూరు ఈస్ట్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కంకరగుంట గేటు ప్రాంతానికి చెందిన మిరియాల శ్రీను కుమారుడు వెంకట నరేష్ (25) చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. మానసికంగా కుంగిపోయి శనివారం ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలుకల మందు తిని...

ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీకి చెందిన షేక్ జిలేఖా మూడో కుమారుడు బాజీ (24) చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. మానసికంగా కుంగిపోయి శనివారం ఎలుకల మందు తిని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శక పాలన కోసమే సచివాలయ వ్యవస్థ



తాడికొండ: పారదర్శకపాలన అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చినట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. తాడికొండ మండలం లాం గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ శనివారం ప్రారంభించారు. క్రిస్టినా మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం మీ ముందు ఉందనీ, సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు నిరుద్యోగ సమస్యలను తీర్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నందునే నేడు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ కల్పన జరిగిందన్నారు. త్వరలో పలు రకాల ఉద్యోగాలు భర్తీ కానున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎప్పుడైనా పేదల గురించి పట్టించుకున్నారా ? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏదైనా పని కావాలంటే ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, నేడు లేదన్నారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ పారదర్శకంగా పనిచేస్తుందని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని అవకాశాలు మన ముందుకు రానున్నాయని, పనిచేసే వారికి పట్టం కట్టేందుకు 2024 ఎన్నికలలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు రావూరి దివ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, వివిధ విభాగాల నాయకులు రాయపూడి రంగారావు, నాగార్జునరెడ్డి, కొండ కిశోర్‌రెడ్డి, బెజ్జం సాయి ప్రసాద్, వై.నాగార్జునరెడ్డి, కొల్లికొండ వెంకటేశ్వరరావు, షేక్ సలీం, తాడిబోయిన శివన్నారాయణ, గునుగునూరు సాంబిరెడ్డి, ధర్మరాజు, షేక్ హుస్సేన్, దీవెనరాజు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ఆలపాటి వెంకట్రామయ్య


తెనాలిఅర్బన్: ఆలపాటి వెంకట్రామయ్యను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరారు. మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య 106వ జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదురు ఉన్న ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, కొడాలి శ్రీనివాసరావు, ఉయ్యూరు రాజశేఖర్‌రెడ్డి, ముసునూరి నాగ బసవేశ్వరరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య వద్దు.. బతుకే ముద్దు

ఆత్మహత్య మహా పాపమని మన శాస్త్రాలు చెబుతున్నాయి. అయినా, కొందరు దాన్ని పట్టించుకోకుండా చిన్నచిన్న సమస్యలకే బెంబేలెత్తిపోయి చేతులారా నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఏడాదికి ఏడు లక్షల మంది ఆత్మహత్యలతో మరణిస్తున్నారు. ఇందులో పురుషులు 73 శాతం మంది, మహిళలు 27 శాతం మంది ఉన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 15నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సువారే ఎక్కువ. క్షణికావేశంలో నిండు జీవితాల్ని బలి చేసుకుంటున్నారు. వారు చేసే తప్పు వల్ల కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధుమిత్రులు కుదేలై జీవితమంతా మానసిక క్షోభను అనుభవిస్తూ కాలం వెళ్లబుచ్చుతుంటారు. ఆత్మహత్యల్ని నివారించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ సంస్థ సంయుక్తంగా 2003 నుంచి ఏటా సెప్టెంబరు 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.



జీజీహెచ్‌లోని మానసికవ్యాధుల ఓపీ విభాగం



వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే పోస్టర్

- క్షణికావేశంతో పలువురి ఆత్మహత్య
- మధ్య వయస్కుల్లో ఎక్కువ
- ఆత్మహత్య ఆలోచన కూడా మానసిక సమస్యే..
- చికిత్సతో నివారణ
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

జిల్లాలో ఆత్మహత్యల వివరాలు

గుంటూరు జిల్లా పోలీసు లెక్కల ప్రకారం

సంవత్సరం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
2020	310	93	---	403
2021	339	110	---	449
2022	371	146	---	517
2023 (ఆగస్టు వరకు)	251	66	1	318

గుంటూరు మెడికల్: మన దేశంలో రోజురోజుకూ ఆత్మహత్యలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ సమస్యలు, అనారోగ్యం, ఆల్కహాలు, మాదకద్రవ్యాలకు బానిసలవ్వడం, వైవాహిక సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో అపజయాలు, ఒత్తిడి, కుంగుబాటు, ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం, ఆస్తి తగాదాలు, బీదరికం, అక్రమ సంబంధాలు, కుల, వర్గ వివక్షలతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2021లో 1.64 లక్షల మంది ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం.

లక్షణాలు ఇవి...

- డల్‌గా ఉండటం
- అందరితో కలవకుండా మూలన కూర్చోవడం
- కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపకుండా ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడడం,
- బరువు తగ్గిపోవడం
- ముఖం దిగాలుగా ఉండటం
- ఆహారం మాని వేయడం

వీరిని ఓ కంట కనిపెట్టాలి

సామాజిక మాధ్యమాలు, వార్తా పత్రికల్లో ఆత్మహత్యలు జరిగే విధానాన్ని అన్వేషించే వారిని, విచారం, దిగులు, దుఃఖం, ఎక్కువ కాలం ఉంటే అది ఆత్మహత్యకు దారి తీసే అవకాశముంది. సాధారణ ప్రవర్తనకు భిన్నంగా సడన్‌గా శాంతంగా ఉండడం, నిరుత్సాహంగా గడపడం చేస్తుంటే తేడాను గమనించాలి. గతంలో లాగా స్నేహితులతో కలవకుండా, ఆట పాటల్లో పాల్గొనకుండా, దైనందిన కార్యక్రమంలో నిరాసక్తతతో ఒంటరితనంగా ఉండడానికి ఇష్టపడుతుంటే ఆ మార్పును ఆత్మహత్యకు సంకేతంగా పరిగణించాలి. మాటల్లో, సంభాషణల్లో నైరాశ్యం కనబరుస్తూ, వస్త్రధారణలో, వ్యక్తిగత శుభ్రతలో, ఆకర్షణలో నిరాసక్తత, వ్యక్తపరుస్తుంటే వారిని తప్పనిసరిగా వారితో మాట్లాడి వారి బాధను ఆలకించి మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చు

ఆత్మహత్య చేసుకోవాలని మనసులో నిశ్చయించుకున్న వారు ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. ఇంట్లో తమపై ఉన్న బరువు బాధ్యతల్ని ఇతర కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. ఆస్తిపాస్తుల వివరాలు వెల్లడి చేస్తారు. జీవితంలో ఎదగాలంటే ఎలా ఉండాలో జాగ్రత్తలు సైతం పిల్లలకు, కుటుంబ సభ్యులకు వివరిస్తారు. ఇలాంటి వారిని తక్షణమే మానసిక వైద్యులకు చూపించడం ద్వారా ఆత్మహత్యకు పాల్పడకుండా నివారించవచ్చు. కుటుంబ సభ్యులు ఎవరైనా అడిగిన వస్తువు కొనిపించకపోతే చనిపోతామని బెదిరిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా తక్షణమే స్పందించి వారిని మానసిక వైద్యులకు చూపించాలి. ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం మానసిక రుగ్మత. దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

దీర్ఘకాలిక రోగులపై అప్రమత్తంగా ఉండాలి



క్యాన్సర్, కిడ్నీ, గుండె జబ్బులాంటి దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారిపై కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి. వీరిలో పలువురు జీవితాంతం మందులు వాడాలనే డిప్రెషన్‌తో ఆత్మహత్యకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోవిడ్ అనంతరం ఎక్కువ మంది మానసిక ఆందోళనకు గురై వైద్య నిపుణుల్ని సంప్రదిస్తున్నారు. మానసిక వ్యాధులవైద్యుల సంఘం రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న వైద్యులకు సీఎంఈ నిర్వహించాం. 10న గుంటూరు నగరంలో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఐ.వి.ఎల్. నరసింహారావు, మానసికవ్యాధి నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఉచితంగా వైద్యసేవలు



ఆర్థికపరమైన సమస్యలు, సంసార జీవిత సమస్యలు, పిల్లలు మాట వినకపోవడం, ప్రయోజకులు కాకపోవడం, ఉద్యోగపరమైన ఒత్తిడులు, తాగుడు అలవాటు ఉండటం, కుటుంబంలో ఎవరైనా ఆత్మహత్య పాల్పడి ఉండటం తదితర కారణాల వల్ల పలువురు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి వారిని ఓ కంట కనిపెట్టాలి. ఆత్మహత్యలకు పాల్పడే ఆలోచన ఉన్నవారితో సమస్యపై చర్చించడం, వారికి వనరులు కల్పించడం ద్వారా నివారించవచ్చు. గుంటూరు జీజీహెచ్‌లో ఆత్మహత్యాయత్నం చేసిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారు సాధారణ జీవితం గడిపేలా చేస్తున్నాం.

–డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగం

యువతను తప్పదారి పట్టిస్తున్న బిగ్ బాస్



లక్ష్మీపురం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్నిదెబ్బతీస్తూ యువతను తప్పుదారి పట్టిస్తున్న బిగ్ బాస్ రియాల్టీ షోను నిషేధించాలని ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి షేక్ గని డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రిపూట వచ్చే ఈ బిగ్‌బాస్ రియాల్టీ షో వల్ల యువత నాశనమవుతోందని తెలిపారు. షోని కుటుంబసభ్యులతో కలసి చూడటం ఇబ్బందిగా ఉందన్నారు. అసభ్యకర ప్రవర్తనలతో సభ్యసమాజం తలదించుకునేలా ఉన్న ఈ షోను తక్షణమే నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయకుడు కవి పి.ఎస్ మూర్తి మాట్లాడుతూ వివాహం కాని యువతీ,యువకులను ఒక గదిలో ఉంచి పాశ్చాత్య దేశాల మాదిరిగా సహజీవనానికి ప్రేరేపించినట్లు ఈ రియాల్టీ షో నడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని నుంచి ఈ తరం కానీ, భవిష్యత్తు తరాలుగానీ ఏమి నేర్చుకుంటారనేది అంతుచిక్కని ప్రశ్నగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్,పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ విశ్వేశ్వరుడి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరాలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా శనివారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మల్లికార్జునశర్మ, అనూష, కోటేశ్వరరావు, శిరీష దంపతులతో అర్చకులు విశ్వేశ్వరశర్మ పూజలు చేయించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, చక్రపాణి పర్యవేక్షించారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు




ఆత్మహత్యల నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్న సమస్యను ఎంతో పెద్దదిగా ఊహించుకుని జీవితాన్ని అర్ధంతరంగా ముగించడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని ప్రముఖ మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణురాలు డాక్టర్ చంద్రికారెడ్డి పేర్కొన్నారు. సాయిబాబా రోడ్డులోని జీవీఆర్ అండ్ ఎస్ మహిళా కళాశాలలో స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మహత్యల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చంద్రికారెడ్డి మాట్లాడుతూ సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవడం ద్వారా దాన్నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఫౌండేషన్ డైరెక్టర్ అంజిరెడ్డి మాట్లాడుతూ 2020లో డాక్టర్ ఈదా శామ్యూల్‌రెడ్డిచే ప్రారంభించబడిన స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడున్నరేళ్ల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 10 లక్షల మంది విద్యార్థులకు జీవిత పరమార్థాన్ని తెలియజేసిందన్నారు. ప్రముఖులతో చేసిన అవగాహన కార్యక్రమాల ద్వారా 600 మంది విద్యార్థులు ఆత్మహత్యల ప్రలోభాల నుంచి బయటపడ్డారని చెప్పారు. జీవీఆర్ కళాశాలతో పాటు విజన్ కళాశాల, స్కాలర్స్ స్టడీ సర్కిల్‌లో అవగాహన తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్‌రెడ్డి సారథ్యంలో వచ్చేనెల 10వ తేదీ వరకు నెల రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 500 కళాశాలల్లో 'జీవితం ఎంతో అమూల్యం – ఆత్మహత్యలు పరిష్కారం కాదు' అంశంపై విద్యార్థుల్ని చైతన్యవంతం చేసే కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ గౌరవ డైరెక్టర్ డాక్టర్ పి.కిశోర్‌కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.చిరంజీవి, వి.రామానుజమ్మ, పున్నయ్య, పి.శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీల్, నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి


డాక్టర్ కిరణ్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: సమస్యలనేవి ప్రతి ఒక్కరికీ ఎదురవుతాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గుంటూరు జీజీహెచ్‌లోని శుశృత హాలులో గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ మానసిక వైద్య విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ×ఆత్మహత్యలు– అపోహలు– వాస్తవాలు× అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు లేకపోతే జీవితం లేదని, ప్రశ్న లేకపోతే సమాధానం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిరాశ, నిస్పృహ నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. సమాజంలో యువత దృఢంగా ఉండాలని చెప్పారు. ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ఆటలాడాలని సూచించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ మానసిక వ్యాధితో బాధపడుతున్న వారంతా సరైన చికిత్స తీసుకుంటే తక్షణమే విముక్తి పొందవచ్చని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడి వల్లే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఒత్తిడి నివారణకు సరైన సమయంలో మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ వడ్డాది వెంకట కిరణ్, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ కాత్యాయని, డాక్టర్ లవ్లీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సౌత్ ఇండియన్ ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో వంటలను పరిశీలిస్తున్న ఏపీటీడీసీ ఈడీ పద్మావతి



ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

పాత గుంటూరు: విద్యానగర్‌లోని ది క్యాపిటల్ హెూటల్‌లో ప్రారంభమైన సౌత్ ఇండియన్ ఫుడ్ ఫెస్టివల్ ఆహార ప్రియుల్ని ఆకట్టుకుంది. సంప్రదాయ దుస్తులతో మహిళలు విధులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీటీడీసీ ఈడీ ఎ.ఎ.ఎల్. పద్మావతి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్టివల్‌ను ప్రారంభించారు. హెూటల్ డైరెక్టర్ మురుకొండ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఫెస్టివల్‌లో దక్షిణ భారత వంటకాల రుచుల్ని అందిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారత ఆహారంతో పాటు సంస్కృతిని ఇతర ప్రాంతాలకు ప్రచారం చేయడమే ఫెస్టివల్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఆహా ఆంధ్రా రుచులు, ఫుడ్ ఫెస్టివల్స్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత ఆహారాన్ని పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా హాస్పిటాలిటీ రంగంలో దక్షిణ భారత ఆహారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన వివరించారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు, డ్రెయిన్లు నిర్మాణం

మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరి



23వ డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

నెహ్రూనగర్: ఆక్రమణలు తొలగించి రోడ్ల నిర్మాణం చేపట్టాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధికారులకు సూచించారు. 23వ డివిజన్‌లోని దర్గా వెనుక రోడ్డులో శనివారం పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి ఆయన పర్యటించారు. ఆక్రమణల్ని వెంటనే తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గా వెనుక బీటీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. ఆక్రమణల్ని వెంటనే తొలగించి మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు, డ్రెయిన్లు నిర్మించాలని అధికారుల్ని ఆదేశించారు. ఆక్రమణలు తొలగించే సమయంలో అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే ఎన్నో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం గుండారావుపేట ప్రాంతంలో పర్యటించి పారిశుద్ధ్య పనుల్ని తనిఖీ చేశారు. సైడు కాలువలు శుభ్రం చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రతిరోజూ శుభ్రం చేయించి, పక్కాగా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని మేయర్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ అజయ్ కుమార్, ఈఈ సుందరరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాధు రాజేష్, అయిశెట్టి కనక దుర్గ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అవినీతికి ప్రతిరూపం చంద్రబాబు


- ఐటీ నోటీసులకు సమాధానం చెప్పాలి
- పత్తిపాడు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీలు తుమ్మల సుబ్బారావు, గుల్జార్‌బేగం

గుంటూరు రూరల్: ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అవినీతికి ప్రతిరూపమని గుంటూరు రూరల్, కాకుమాను జెడ్పీటీసీ సభ్యులు తుమ్మల సుబ్బారావు, గుల్జార్‌బేగం విమర్శించారు. నగరంలోని బ్రాడీపేటలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్న 14 ఏళ్లలో రూ.లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఆయనపై వచ్చిన ప్రతి కేసును కోర్టుల ద్వారా స్టేలతో మ్యానేజ్ చేసుకుంటూ.. తాను నిప్పు, తుప్పు అని చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఐటీ శాఖ నోటీసులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, అతి తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.371 కోట్లను కనీసం ఆధారాలు లేని కంపెనీల పేరుతో దోచుకున్నారని వారు దుయ్యబట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మొత్తం రూ.3,356 కోట్లు ఖర్చు చేశారని.. అందులో ప్రతి రూపాయిలో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అవినీతిపై 22 స్టేలను తీసివేసి, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీమెన్స్ కంపెనీ నుంచి ఒక్కపైసా గ్రాంట్ ఈస్ ఎయిడ్ లేకుండా రూ.371 కోట్లు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. పెదనందిపాడు మాజీ మండల కన్వీనర్ మదమంచి వాసు, కాకుమాను ఎంపీపీ శ్రీనివాసరావు, పత్తిపాడు మాజీ మండల కన్వీనర్ గట్టు విజయ్‌కుమార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఉద్దగిరి మురళి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సాంబశివరావు, సర్పంచ్ అనంత దుర్గాప్రసాద్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఓం ప్రకాష్‌రెడ్డి, మండల సోషల్ మీడియా విభాగం కన్వీనర్ పుట్టా బాజీ, గోపీ యాదవ్, తంగెళ్ల నాగేశ్వరరావు, శంకర్, వెంకట్, సాయి, బి.సుబ్బారావు, అమృతయ్య వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా స్వరరాగావధానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా శనివారం గాయత్రి మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో స్వరరాగావధానం ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమానికి ఉపన్యాస భారతి మంచికంటి వెంకట సత్యవతి జ్యోతి ప్రజ్వలన చేశారు. సభలో ముఖ్య అతిథిగా డాక్టర్ రామినేని ధర్మప్రచారక్, విశ్రాంత అధ్యాపకులు పి.ఎస్. దత్త ప్రసాద్ పాల్గొన్నారు. విదుషి ఆర్. లక్ష్మీశ్రీనివాస్ ప్రార్థనతో స్వరరాగావధానం ప్రారంభించారు. అవధాని గరికపాటి వెంకట ప్రభాకర్, డాక్టర్ వెంకట సుబ్రహ్మణ్యం, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్. దీక్షిత్, సమ్మండలి విదుషి మాధవపెద్ది మీనాక్షి పాల్గొని ప్రసంగించారు. కళాకారులు హేమాద్రి చంద్రకాంత్, మాధవీకృష్ణ, సుధాకర్, నందకుమార్, ఎన్. శాంతి , జొన్నలగడ్డ భువనేశ్వరి పాల్గొని స్వరరాగావధానం రక్తి కట్టించారు. అతిథులు, పృచ్ఛకులను సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి. విజయ, ప్రధాన కార్యదర్శి ఎం. వై. శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, పాటిబండ్ల లలితాదేవి, కోశాధికారి ఎం. విజయ లక్ష్మి, కార్యదర్శి ఏ. మంగాదేవి ఘనంగా సత్కరించారు.